ఏకలవ్యలో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఈ విద్యా సంవత్సరానికి 6,7,8,9,11, తరగతుల్లో మిగులు సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో కోరారు. మొత్తం 39 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. కుటుంబ ఆదాయం లక్షలోపు ఉన్న ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. 2025 -26 లో ఏకలవ్య ఆరో తరగతి ప్రవేశ పరీక్ష రాసిన వారు ఆరో తరగతి సీట్లకు అర్హులన్నారు. 7,8,9 11, తరగతులకు ఈ విద్యా సంవత్సరంలో కింది తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం మాత్రమే సీట్లు కేటాయింపు జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 29లోగా సమర్పించాలన్నారు. ఇంటర్‌లో చేరగోరు విద్యార్థులు టెన్త్ మార్కుల మెమో/ పుట్టిన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్ (విద్యార్థి), స్టడీ సర్టిఫికేట్ , 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు ఇవ్వాలన్నారు.

మా పొట్ట కొట్టకండి

- గర్భిణుల వసతి గృహ ఆరోగ్య సిబ్బంది వేడుకోలు
- ఐటిడిఎలో నిధులు లేవంటూ విధుల నుంచి తొలగించేందుకు చర్యలు?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నెలల తరబడి జీతాలివ్వకున్నా ఉన్న ఉద్యోగాన్ని నమ్ముకుని పనిచేస్తున్న తమను తొలగించి మా పొట్టకొట్టకండి అంటూ గుమ్మలక్ష్మీపురం గిరిజన గర్భిణుల వసతి గృహంలో పనిచేస్తున్న తాత్కాలిక ఆరోగ్య కార్యకర్తలు కన్నీటిపర్యమవుతున్నారు. ఐటిడిఎ బడ్జెట్‌లో నిధుల్లేవని, జీతాల చెల్లించలేమని మిమ్మల్ని తొలగిస్తున్నామని అధికారులు చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. తమ ఉద్యోగానికి భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే...

గుమ్మలక్ష్మీపురం వైటిసిలో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని 2019లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇక్కడ 12 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో ఒక స్టాఫ్ నర్స్, ఏడుగురు ఎఎన్‌ఎంలు, ముగ్గురు స్వీపర్లు, ఒక డ్రైవరు ఉన్నారు. అయితే గత మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వేతన బకాయిలు ఉన్నాయి. నెలవారీ జీతాలు రాకపోయినా బాధపడలేదు. ఉన్న ఉద్యోగాన్ని కాపాడుకోవాలంటూ బాధ్యతతో పనిచేస్తూ వస్తున్నారు. ఇదే సమయంలో ఐటిడిఎ అధికారులు పిడుగులాంటి వార్త చెప్పారు. నిధుల్లేవని, మిమ్మల్ని తొలగిస్తున్నామంటూ నోటి మాట ద్వారా సెలవిచ్చారు.

కాబోయే అమ్మకు కంటికి రెప్పలా

కాబోయే అమ్మ ఆరోగ్యంగా ఉండడానికి, సుఖప్రసవం కావడానికి గర్భిణుల వసతి గృహ ఆరోగ్య సిబ్బంది కంటికి రెప్పలా చూసుకుంటూ సేవలందిస్తూ వచ్చారు. ఇక్కడ 15 మంది గర్భిణులు సేవలు పొందుతున్నారు. పౌష్టికాహారం అందజేస్తారు. యోగా చేయిస్తారు. ప్రసూతి వైద్యులు, సిబ్బంది పర్యవేక్షణలో పరీక్షలు, వైద్యం అందిస్తారు. అత్యవసరమైతే స్థానికంగా ఉన్న ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవమయ్యేలా చూస్తారు. ఇన్ని సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బందిని తొలగింపు చర్యలు చేపట్టడం విచారకరం. ప్రస్తుతం ఇక్కడ రెగ్యులర్ ఉద్యోగులను నియమించారు. వీరు మంగళవారం వీధుల్లో చేరారు.

గుమ్మలక్ష్మీపురంలో గల గర్భిణుల హాస్టల్

4,440 మంది గర్భిణులకు సేవలు

కొండ శిఖర గ్రామాల్లో రహదారి సౌకర్యం లేక వైద్యం కోసం వస్తున్న గర్భిణులకు డోలిలే శరణ్యమవుతున్నాయని, సరైన వైద్య సేవలందడం లేదని అప్పటి పార్వతీపురం ఐటిడిఎ పిఒ లక్ష్మీషా గర్భిణుల వసతి గృహం ఏర్పాటుకు రూపకల్పన చేశారు. మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సుమారుగా 4,440 మంది గర్భిణులు సేవలు పొందారు.

రోడ్డున పడేశారు

గర్భిణుల వసతి గృహం ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు బాధ్యతతో విధులు నిర్వహించాను. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా సమయంలో కూడా గర్భిణులకు కరోనా సోకితే సేవలందించాను. ఉద్యోగ భద్రత దొరుకుతుంది అనుకుంటే ఉద్యోగమే లేకుండా రోడ్డును పడేశారు.

మహాలక్ష్మి.
ఎఎన్‌ఎం, గుమ్మలక్ష్మీపురం.

సకాలంలో వేతనాలివ్వకపోయినా పని చేశాం

సకాలంలో వేతనాలు చెల్లించకపోయినా బాధ్యతగానే పనిచేశాం. నెలనెలా వేతనాలు ఇవ్వలేదని ఎప్పుడు బాధపడలేదు. 24 గంటల పాటు సేవలు అందిస్తూ గిరిజన గర్భిణులు సుఖప్రసవాలయ్యేలా కృషి చేశాం. అయినా అధికారులు, పాలకులు ఉద్యోగ భద్రత లేకుండా చేశారు.

ఎం.వజ్రం
ఎఎన్‌ఎం, గుమ్మలక్ష్మీపురం.

పర్యాటక సీజన్‌కు ఎస్‌టిఆర్ పార్క్ సిద్ధం

అక్టోబర్ తొలి వారానికి పనులన్నీ పూర్తికావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

పర్యాటక సీజన్ ప్రారంభం నాటికి ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కును సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కు అభివృద్ధికి సూచించిన పనులన్నీ అక్టోబర్ మొదటి వారానికి పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పార్కుకు విచ్చేసే పర్యాటకులకు పచ్చదనం, పరిశుభ్రంతో మంచి ఆహ్లాదకర వాతావరణం కనిపించాలని పేర్కొన్నారు. గిరిజన యువత వివిధ రకాల షాపులను నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలని, తద్వారా వారికి ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పర్యాటకుల అవసరాలు తీరుతాయని కలెక్టర్ వివరించారు. స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కును కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, మన్యం జిల్లా నలుమూలల నుంచి ఈ అడ్వెంచర్ పార్కుకు పర్యాటకులు నిత్యం వస్తుంటారని, ఇంతటి ప్రాముఖ్యత గల పార్కును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ అధికారులను ఆదేశించారు. పర్యాటకుల వినోదానికి నిర్మించిన 3డి, 5డి థియేటర్లతో పాటు పార్కు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచడం వల్ల పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందని వివరించారు. తొలుత మండలంలోని మెట్టుగూడ జలపాతాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం మెట్టుగూడ వద్ద గల పిఎం జన్ మాన్ కింద నిర్మితమవుతున్న గృహాలను కలెక్టర్ తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

మనుమకొండ గ్రామాభివృద్ధికి కృషి

నీతి అయోగ్ ద్వారా ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం కింద ఆదర్శ గ్రామంగా ఎంపికైన భామిని మండలంలోని మనుమకొండ గ్రామాన్ని అన్ని విభాగాల్లో అభివృద్ధి పథంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఐటిడిఎ మీటింగ్ హాల్లో భామిని మండలానికి చెందిన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీతి అయోగ్ ద్వారా మంజూరైన మోడల్ అంగన్వాడీ భవనాలు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలోని అందరికీ ఆరోగ్య కార్డులు ఉండాలని, మండలంలో ప్రతి గ్రామానికి శ్మశానవాటిక ఉండాలని సూచించారు. ప్రతి చెరువును ఉపాధి హామీ చట్టం ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. కొత్తగా ఫారం పాండ్ పనులను చేపట్టాలని సూచించారు. సర్పంచులతో సమావేశం నిర్వహించి వారి గ్రామాలకు అవసరమై అభివృద్ధి పనులకు ప్రణాళికను తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో భామిని తహశీల్దార్, ఎంపిడిఒ, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్టగూడ జలపాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

అనంతరం సీతంపేట మండలం మండలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. పిల్లలతో వివిధ రకాల ఆటలను కలెక్టర్ స్వయంగా ఆడించారు. అదే విధంగా గ్రామంలోని విడివికె కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విడివికె ద్వారా ఉత్పత్తి చేస్తున్న గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, వీటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. విడివికెలో రికార్డులను తనిఖీ చేసి నిర్వహణ సక్రమంగా ఉండాలని అన్నారు. ఈ పర్యటనలో ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ జి.చిన్నబాబు, ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, డిఇ నాగభూషన్, హౌసింగ్ ఇఇ, ఎంపిడిఒ, తహశీల్దార్ శ్రీకన్య, సిడిపిఒ సింహాలమ్మ పాల్గొన్నారు.

27న సాలూరులో జాబ్ మేళా

పార్వతీపురం : ఈ నెల 27న సాలూరులో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వహీదా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా జరగనుందని అన్నారు. ఈ మేళాలో 5 కంపెనీల్లో వివిధ రకాల పోస్టులకు అవసరమైన 160 ఖాళీలను పూర్తి చేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అన్నారు. 18 ఏళ్ల పైబడి ఐటిఐ, ఇంటర్, గ్రాడ్యుయేషన్, పీజీ పూర్తిచేసిన స్త్రీ, పురుష అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

రైతుల పోరాట ఫలితంగా
విఆర్‌ఎస్ కాలువలో పూడిక తీత

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని తూరుమామిడి గ్రామానికి సాగునీరందడం లేదని సిపిఎం నాయకులు, రైతులు చేసిన పోరాటం ఫలించింది. ఈ మేరకు పంట పొలాలకు సాగునీరు అందేలా బుధవారం ఇరిగేషన్‌శాఖ జెఇ శ్రీనివాసరావు పర్యవేక్షణలో బుధవారం పూడికతీతలు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే...

ప్రొక్లెయినర్‌తో పూడికలు తీయిస్తున్న అధికారులు

ఈనెల 19న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో తూరుమామిడి రైతులు వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ ఆర్‌బిసిలో 19-ఎల్ కాలువ మరమ్మతులు పనులు చేయాలని, అలాగే వెంగళరాయ సాగర్‌లో గల ఆర్‌బిసి, ఎల్‌బిసి పరిధిలో చివర ఆయకట్టుకు నీరందించాలని, తూరుమామిడి పరిధిలో 19 ఎల్ కాలువను పరిశీలించి నిరసన తెలిపారు. దీనికి స్పందించి వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు అధికారులు బుధవారం యంత్రాలతో కొండబుచ్చంపేట నుంచి 19 కాలువను శాంతేశ్వరం పక్కివాని చెరువు వరకు బాగుచేశారు. ఇందుకు రైతులు సిపిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలో గల కాలువలన్నీ మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

బడిదేవరకొండ తవ్వకాల లైసెన్సు రద్దుచేయాలి

- అధికారులపై చర్య తీసుకోవాలి
- బంగారి దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి
- ఎం.కృష్ణమూర్తి, బొత్స నర్సింగరావు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని బడిదేవర కొండపై గ్రానైట్ మైనింగ్ అన్ని అనుమతులతోనే జరుగుతున్నట్లు మైనింగ్ జిల్లా అధికారి ఈనెల 15న ప్రకటన విడుదల చేశారని, ఆ ప్రకటనలో అధికారులే తప్పులు చేసినట్లు స్పష్టమైందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గ్రామీణ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షులు బొత్స నరసింగరావు అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడారు. బడిదేవరకొండ తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా లైసెన్స్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఎలుగుల మెట్టపై ప్రజాభిప్రాయసేకరణ చేశామని చెప్పిన మైనింగ్ అధికారి, బడిదేవరకొండపై కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేశామని ఎందుకు చెప్పలేదంటే, అక్కడ ప్రజాభిప్రాయ సేకరణే చేయకుండా గ్రానైట్ లీజు లైసెన్స్ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించే దమ్ముందా అని సవాల్ చేశారు. బడిదేవరకొండపై ఎక్కడ లైసెన్స్ ఇచ్చారో అక్కడ హద్దులు నిర్ణయించకుండా గ్రానైట్ తవ్వడానికి మైనింగ్ శాఖ ఎలా అంగీకరిస్తుందని ప్రశ్నించారు. అది రిజర్వ్ ఫారెస్టు ప్రభుత్వ భూమని, హద్దులు చూపమని అటవీ అధికార్లు ఎంత మొత్తుకున్నా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఫారెస్టు అధికార్ల అభ్యంతరాలను నివృత్తి చేసి అనుమతులు ఇవ్వొచ్చని హై కోర్టు గతంలో ఉత్తర్వులు ఇచ్చిందని, ఫారెస్ట్ అధికార్ల అభ్యంతరాలు పట్టించుకోకుండా మైనింగ్ అనుమతులు ఎలా ఇచ్చారో, ఎవరి ఒత్తిడితో ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సిల్ట్ సిడిమెంట్ ప్రవాహాన్ని ఆపడానికి వర్కింగ్ పిట్ కోసం డ్రెయిన్, సిల్టేషన్ ప్లాంట్ నిర్మిస్తామని గ్రానైట్ కంపెనీ ప్రతినిధి ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా గ్రానైట్ జరిగిందని అంగీకరించారని చెప్పారు. మరి నిబంధనలు ఉల్లంఘించి ఏడాదిగా మైనింగ్ జరుగుతుంటే సంబంధిత శాఖ ఆపకపోవడం ప్రజలకు ద్రోహం చేసినట్టేనని అన్నారు. దీనివల్ల చెరువు కబ్జాకు గురై పాడి బంగారి దొర మరణానికి కారణమైందని, కనీసం దొర చనిపోయినా మైనింగ్ అధికార్లు గ్రానైట్ లైసెన్స్ యజమానిపై కేసు పెట్టి, అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు డి.పట్టాలు, ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలిచ్చిన భూములను గ్రానైట్ మైనింగ్ కంపెనీ ఆక్రమించలేదని, మైనింగ్ అధికారి సర్టిఫికెట్ ఇవ్వడంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికార్లు వచ్చి గిరిజనుల భూములు గ్రానైట్ కంపెనీ ఆక్రమించిందో తేల్చడంలో జాప్యం ఎందుకని నిలదీశారు. ఈ రకంగా మైనింగ్, రెవెన్యూ, పర్యావరణ అధికారులందరూ తెలిసి చేసిన తప్పులేనని, కావున తక్షణమే బడిదేవరకొండపై గ్రానైట్ మైనింగ్ ఆపేయాలని, లీజు లైసెన్స్ రద్ద చేయాలని డిమాండ్ చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని, బంగారి దొర మరణానికి కారణమైన గ్రానైట్ మైనింగ్ యజమానిని అరెస్టు చేయాలని, దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కొండ రక్షణ కోసం భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

పార్వతీపురానికి మరో వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

దూర ప్రాంత ప్రయాణ సౌకర్యం కల్పించేలా అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉద్నా (సూరత్) - బరంపురం అమృత్ భారత్ వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును మంజూరు చేసింది. అయితే ఈ రైలు రాయగడ తరువాత విజయనగరంలోనే నిలిపివేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటిం చడంతో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యే బేబినాయన, విజయచంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంగా ఉన్న పార్వతీపురం, వాణిజ్య కేంద్రంగా ఉన్న బొబ్బిలిలో ఈ రైలుకు స్టాపేజీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు ఛైర్మన్ సతీష్ కుమార్‌ను విజయచంద్ర కలిసి ఈ రెండు ప్రాంతాల ప్రజల ఆకాంక్ష, డిమాండ్‌ను తెలియజేశారు. దీనిపై స్పందించిన రైల్వే బోర్డు ఛైర్మన్ బొబ్బిలి, పార్వతీపురం స్టాపేజీ కల్పించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో గంటల వ్యవధిలోనే కొత్త షెడ్యూల్‌ను రైల్వే శాఖ విడుదల చేయడం గమనార్హం. అమృత్ భారత్ వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు ఉద్నా నుంచి రాయపూర్, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి మీదుగా బరంపురం మధ్య రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణ నిడివి 30.45 గంటలు కాగా.. మొత్తం 31 స్టేషన్లలో స్టాపేజీ కల్పించారు. దీనిపై ఉమ్మడి విజయనగరం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని కొత్త రైళ్లు ప్రారంభించాలి

రైల్వే బోర్డు ఛైర్మన్ సతీష్ కుమార్‌ను కలిసిన సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర వివిధ ప్రతిపాదనలు ఆయన ముందుంచారు. పార్వతీపురం నుంచే హైదరాబాద్, తిరుపతికి రోజువారీ ప్రయాణించేలా రైళు ,, రాయగడ - విశాఖపట్నం డెయిలీ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్ మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, బెలగాం గేటు వద్ద రైల్వే బ్రిడ్జి నిర్మించాలని, పార్వతీపురం టౌన్, పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్లను యథావిధంగా కొనసాగించాలని కోరారు.

జగన్‌ను కలిసిన జిల్లా నేతలు

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన రాజన్నదొర, జోగారావు, చిన్నశ్రీను

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లి వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు బుధవారం కలిశారు. తాడేపల్లిలో నిర్వహించిన వైసిపి రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు జగన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సిఎంలు పి.రాజన్నదొర, పి.పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఉన్నారు. వీరికి టిడిపి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, భవిష్యత్తు కార్యాచరణ గురించి ఈ సమావేశంలో జగన్ దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

నాలుగు రోడ్లు విస్తరణ

ప్రజాశక్తి -కొమరాడ

మండల ప్రజలు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న నాలుగు రోడ్లు విస్తరణకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మేరకు చిలకపాలెం -రామభద్రపురం -బొబ్బిలి - పార్వతీపురం - కొమరాడ మీదుగా రాయగడ వరకు నాలుగు రోడ్లు విస్తరణకు సర్వే పూర్తయింది. గతంలో ఈ రహదారిలో ప్రయాణించాలంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే గేట్లు ఉండడంతో నిత్యం రాకపోకలు చేసే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో ఎప్పుడు రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతాయా? రైల్వే గేట్లు బాధ ఎప్పుడు తప్పుతుందోనని ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు ఈ ప్రాంత ప్రజల కల నెరవేరబోతుంది. నాలుగు రోడ్లు హైవే, మూడు ఫ్లై ఓవర్లతో మండల రూపురేఖలు మారబోతున్నాయి.

కొమరాడ మండలంలోని ప్రధానంగా ఆంధ్రా - ఒడిశాతో పాటు చత్తీష్‌గడ్, మధ్యప్రదేశ్ అంతర్రాష్ట్ర రహదారి 25 కిలోమీటర్ల మేర విస్తీర్ణంలో ఉంది. గత పదేళ్లుగా ఈ రహదారి నాలుగు రోడ్లు విస్తరణ జరగాల్సి ఉంది. ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్‌లో ఉన్న వివిధ పరిశ్రమలకు నిత్యం ఈ రహదారి గుండా భారీ లారీల ద్వారా మిషనరీ సామాగ్రి తరలింపు జరుగుతుంది. ఈ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు జరగడంతో గత పదేళ్ల క్రితం నాలుగు రోడ్ల విస్తరణకు అప్పటి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. అయితే ప్రభుత్వాలు మారడంతో ఈ రోడ్డుకు ప్రాధాన్యత ఇచ్చి నాలుగు రోడ్లు విస్తరించేందుకు ముందుకు ఎవరూ రాలేదు. ఇటీవల కేంద్రప్రభుత్వం నాలుగురోడ్లు విస్తరణ, మూడు ఫ్లైఓవర్ల నిర్మాణాలకు ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో చిలకపాలెం -రామభద్రపురం -బొబ్బిలి పార్వతీపురం మీదుగా కొమరాడ నుంచి రాయగడ వరకు నాలుగు రోడ్లు విస్తరణ సర్వే ఇటీవల కాలంలో ఒక ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం పూర్తి చేసింది. ఈ రహదారిలో ప్రధాన సమస్యలైన రైల్వే గేట్లతో ప్రజలు నిత్యం నానా అవస్థలు పడుతూ ట్రాఫిక్ అంతరాయాల్లో ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా నాలుగు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే గేట్లు ఉన్నాయి. వీటిపై మూడు ఫ్లైఓవర్లు నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో నాలుగు రోడ్ల విస్తరణ పనులు మందకోడిగా సాగిందని చెప్పొచ్చు. గతంలో రైల్వే ఫ్లైఓవర్లు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం నిధులు మంజూరు చేసి ఫ్లైఓవర్ వంతెన పనులు చేసేవారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ ఏర్పాటుకు వందశాతం నిధులు కేటాయిచడంతో ఈ మూడు రైల్వే గేట్లు వద్ద మూడు ఫ్లైఓవర్ వంతెనలు మంజూరయ్యాయి. దీంతో ఇప్పటికే ఈ మూడు రైల్వే గేట్లు పరిధిలో ఉన్న ఫ్లై ఓవర్లు వంతెనల నిర్మాణాలకు సంబంధించి ఊహా చిత్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

మూడు ఫ్లై ఓవర్ వంతెనలు మారనున్న మండల రూపు రేఖలు



మూడు ప్రదేశాల్లో రైల్వే ఫ్లై ఓవర్ల ఏర్పాటుకు అధికారులు రూపొందించిన మ్యాప్

మండలంలోని అర్తాం, స్వామి నాయుడు వలస, గంగరేగు వలస రైల్వే గేట్లు వద్ద ఫ్లై ఓవర్లకు సంబంధించి భూ సేకరణకు రైల్వే, రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. మూడు గేట్లు వద్ద ఫ్లైఓవర్ వంతెనలు ఏర్పాటుకు ఇప్పటికే రైల్వే శాఖ అధికారులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఎక్కడైతే ఫ్లైఓవర్ నిర్మాణాలు జరుగుతాయో ఆయా గ్రామాలతో గ్రామ సభలు ఏర్పాటు చేసి భూ సేకరణకు రెవెన్యూ అధికారులు త్వరలో చర్యలు చేపట్టాల్సి ఉంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు రైల్వే గేట్లలో రెండు గేట్లను తప్పించి ఒకే దగ్గర ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టేందుకు అప్పట్లో ప్రణాళికలు సిద్ధం చేశారు. అర్తాం కొండ పక్క నుంచి సోమినాయుడు వలస రైల్వే గేట్ వరకు రహదారి సౌకర్యం కల్పిస్తే అర్తాం, సోమి నాయుడు వలస రైల్వే గేట్లు తప్పించేందుకు అవకాశాలు ఉన్నాయని, గంగరేగువలస వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణాలకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించడంతో ఈ మూడు రైల్వే గేట్లు వద్ద ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణాలు కానున్నాయి. దీంతో కొమరాడ మండలంలోని నాలుగు రోడ్లు విస్తరణతో పాటు మూడు రైల్వే గేట్లపై వంతెనలు నిర్మాణాలు జరిగితే ఈ మండల రూపురేఖలు మారి అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇటీవల కాలంలో నాలుగు రోడ్లు విస్తరణకు జరిపిన సర్వే

అన్ని విధాలా సహకరిస్తా : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులు, దివంగత పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని రిటైర్మెంట్, డెత్ బెనిఫిట్స్ సకాలంలో అందేలా సత్వర చర్యలు చేపట్టి పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్‌పి ఎస్‌విమాధవ్ రెడ్డి పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగ విరమణ, ఉద్యోగస్తులు సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలపై జిల్లా ఎస్‌పి అధ్యక్షతన బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌పై సకాలంలో అందేలా ఉత్తరప్రత్యుత్తరాలు జరపాలన్నారు. అదేవిధంగా ఇతర శాఖల నుంచి ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని, వాటికీ పరిష్కార మార్గం చూపేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామన్నారు. అనంతరం మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బందికి ఎస్‌పి భోజన వసతి ఏర్పాటు చేసి స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎస్‌బి సిఐ రమేష్, ఎఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, ఎఎఒ సతీష్ బాబు, సూపరింటెండెంట్ శంకరరావు, సిసి సంతోష్, కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు విశ్రాంత ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

104 వాహనం తనిఖీ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని తాలాడలో 104 వాహనాన్ని జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలిం చారు. వాహనాన్ని తనిఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకుని వచ్చినట్లైతే, వెంటనే అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తానని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆపరేటివ్ ఎగ్జిక్యూ టివ్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జనసేన నియోజకవర్గ నాయకులు

రేషన్ డిపోలు మంజూరు చేయాలి

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలం లోని రాయగడ జమ్మూ, కొమరాడ మండలం కంబవలసలో రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని జనసేన కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కడ్రక మల్లేశ్వరరావు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. విజయవాడలో బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాయగడ జమ్మూలో ద్వాక్రా సంఘాలు నడిపిన రేషన్ డిపోను వైసిపి ప్రభుత్వం తొలగించిందన్నారు. ఆ డీలర్ పోస్ట్ మళ్లీ పునరుద్ధరించాలని కోరారు. కంబవలసలో అదనంగా మరో రేషన్ డిపోను మంజూరు చేయాలని మంత్రిని కోరినట్టు చెప్పారు. పై రెండు డిపోల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కురుపాం ఎఎంసి వైస్ చైర్మన్ గార గోపీ శంకర్, దమ్మంగి సర్పంచ్ పాలక క్రాంత్ కుమార్, టిడిపి నాయకులు కిల్లక దాసు, కొమరాడ మండలం జనసేన అధ్యక్షులు బెంటు శ్రీకర్ ఉన్నారు.

అంతర్జాతీయ సాహిత్య పండగకు మల్లిపురం ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 28వరకు పాట్నాలో నిర్వహిస్తున్న ఉన్మేష అంతర్జాతీయ సాహిత్య పండగకు ఆదివాసీ కష్టాలను అక్షరాలుగా మలిచి, బాహ్య ప్రపంచానికి కళ్లకు కట్టినట్లు వివరించిన కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు, రచయిత మల్లిపురం జగదీష్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మినీ రేషన్ డిపో మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో మినీ రేషన్ డిపో మంజూరు చేయాలని, మండలంలోని చలమయ్యవలస పంచాయతీ పెద్దూరు, సింధునగర్ గ్రామాలకు చెందిన ఎస్.నగేష్, ఎ.రాకేష్, బి ఆనందరావు, లావణ్య, ఎ.సూరయ్య, ఎస్.ప్రశాంతి, బి.రామారావు, బాలయ్య, నాగేశ్వరరావు, సుందరరావు తదితర గిరిజనులు అధికారులను కోరుతున్నారు. పెద్దూరు, సింధునగర్ గిరిజన గ్రామాలకు సంబంధించి సుమారు 90 రేషన్ కార్డులు ఉన్నాయని, సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చలమయ్యవలస గ్రామానికి వెళ్లి ప్రతి నెలా రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల కాలంలో కలెక్టర్ ఎ.శ్యామ ప్రసాద్‌కు వినతిపత్రం కూడా అందజేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పెద్దూరు లేదా సింధునగర్ గిరిజన గ్రామంలో మినీ రేషన్ డిపో మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఈ రెండు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

కెజిబివి ఎదురుగా గ్యాస్ గోడౌన్ పెట్టొద్దు

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట గ్యాస్ గోడౌన్ ఏర్పాటు చేయొద్దని సిపిఎం నాయకులు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు గ్యాస్ గోడౌన్ అనుమతులు పరిశీలించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెజిబివి ఎదుట ఉన్న గ్యాస్ గోడౌన్ అనుమతులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరారు. ఒకవేళ అనుమతిలిస్తే ఎదురుగా పాఠశాల ఉన్నందున ప్రమాదం ఉందా?లేదా? అన్న విషయాన్ని తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలో సుమారు 300 మందికి పైగా విద్యార్థులు చదువుతున్న నేపథ్యంలో ఎదురుగా గ్యాస్ గోడౌన్‌కు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సిహెచ్‌ఎన్‌సిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గుమ్మలక్ష్మీపురం గ్రామస్తులు, యువత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛందంగా 25 మంది పాల్గొని రక్తదానం చేశారు. అలాగే సిహెచ్‌సిలో వైద్య శిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి 200 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, టిడిపి మహిళా విభాగం కార్యదర్శి వెంపటాపు భారతి, బిజెపి మండల కన్వీనర్ కడ్రక అప్పలస్వామి, ఎఎంసి డైరెక్టర్ పి.దివాకర్, కూటమి నాయకులు మద్ది దొరబాబు, మండంగి భూషణ, భాస్కర్ రావు, మజ్జి ప్రసాదరావు, తాడంగి దమయంతి తదితరులు ఉన్నారు.

సాలూరులో స్వచ్ఛతోత్సవ్.. స్వచ్ఛతాహీ

ప్రజాశక్తి - సాలూరు

స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన ఉండాలని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ తెలిపారు. స్వచ్ఛతోత్సవ్... స్వచ్ఛతాహీ కార్యక్రమంలో పట్టణంలోని పలు మురికివాడల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు స్వచ్ఛత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కృషి చేయాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలకృష్ణ పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్వచ్ఛత ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత, సింగల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అరటి, విస్తరాకుల వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న షాపులకు అపరాధ రుసుం విధించి, ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో పర్యావరణ సచివాలయ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

26న విద్యుత్ కోత

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు ఈనెల 26న విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండదని విద్యుత్‌శాఖ ఎఇ పి.శివాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. కావున వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

సొంతిల్లు సామాజిక హోదా

ప్రజాశక్తి -భామిని

ఇంటిని ప్రారంభిస్తున్న ప్రభుదాస్

ప్రతి కుటుంబానికి సొంతిల్లు అనేది ఒక కల అని, సొంతిల్లు ఉంటే ఆ కుటుంబానికి గౌరవప్రదమైన హోదా ఉంటుందని హెబిటేట్ ఫర్ హ్యుమానిటీ ఇండియా క్రాస్ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. మండలంలోని మూలగూడలో హెబిటేట్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గృహ ప్రవేశాలు బుధవారం నిర్వహించారు. పెద్దమూలగూడ, చిన్న మూలగూడలో కనీస నివాసం లేని, ఆర్థికంగా వెనుకబడి ఆర్థిక కారణాలతో తమ గృహ నిర్మాణాలను పూర్తి చేయలేని ఆదుకుని గిరిజన లబ్ధిదారులను గుర్తించి, వారి ఇంటి నిర్మాణానికి అవసరమైన సామాగ్రి సమకూర్చి ఇంటిని పూర్తి చేసి వారికి బుధవారం అందజేశారు. మండలంలోని వివిధ కారణాలతో గృహ నిర్మాణాలను పూర్తి చేయలేని 40 మంది గిరిజన లబ్ధిదారులను గుర్తించామని, వారికి అవసరమైన సామాగ్రి సమకూర్చి, నిర్మాణాలు పూర్తి చేసి, 95శాతం మంది లబ్ధిదారులకు ఇళ్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో భామిని అడ్మిన్ ఆఫీసర్ రజినీకాంత్, హౌసింగ్ సిబ్బంది, హెబిటేట్ క్రాస్ స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా పార్కులు : జెసి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పర్యాటకులను ఆకర్షించేలా ఐటిడిఎ పార్కును తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని సుంకిలోని ఐటిడిఎ పార్కును జేసీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులతో ఆయన మాట్లాడుతూ పార్కుకు వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటుచేయాలని, పార్కులో ఉండే వసతులు, సదుపాయాలపై ప్రధాన ద్వారం వద్ద, లోపల భాగంలో బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి ప్రతిపాదనలను సమర్పించాలని పేర్కొన్నారు. పార్కుకు వచ్చే పర్యాటకులకు కనులవిందుగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పార్కులో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, ఎల్లపుడు పచ్చదనం, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పార్కు నిర్వహణ బాగుండాలని, మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలని సూచించారు. బోటింగ్‌తో పాటు ఇతర సదుపాయాలను కల్పించాలన్నారు. పార్కుకొండపై గేటును ఏర్పాటుచేయాలన్నారు. పార్కు అభివృద్ధికి ఏమి అవసరమో వాటాన్నింటిని సమకూర్చాలని, ఇందుకు అవసరమయ్యే అంచనాలతో ప్రతిపాదనలు త్వరగా సమర్పించాలని జేసీ ఆదేశించారు. పర్యటనలో ఎపిఒ ఎ.మురళీధర్, సహాయ ఇంజినీర్ తిరుపతిరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మధ్యాహ్న భోజన కార్మికుల, పాఠశాల స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రతి నెలా బిల్లులు, జీతాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు సుశీల, మాలతితో కలిసి ఎంఇఒ చంద్రశేఖర్‌కు బుధవారం వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాఠశాల విద్యార్థులకు వేడివేడి భోజనం పెడుతూ వారి ఆలనా పాలన చూస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా వీరికి చెల్లిస్తున్న వేతనం అరకొర మాత్రమేనని అన్నారు. యూనిఫామ్, గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ కల్పించాలని, సబ్సిడీ గ్యాస్ అందించాలని, మెనూ ఒక్కొక్కరికి రూ.22 ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి ఎంఇఒ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని, మిగతావి ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు హేమలత, సుమలత, జ్యోతి, కుమారి, ఇందూ, శైలజ, ఆదమ్మ ,లతా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం : వ్యకాస

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎన్.సింహాచలం అన్నారు. మండలంలోని కడకల్లలో వ్యవసాయ కార్మికులతో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పనుల్లేక, శ్రమకు తగ్గ కూలి రాక, పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్లో ఉన్న ఉపాధి కూలి, అన్నదాత సుఖీభవ డబ్బులు చాలా మందికి జమ కాలేదన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందక బ్లాక్ మార్కెట్లో ఎక్కువ ధరకు కొనాల్సి వస్తుందన్నారు. పండిన పంటను దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడడంతో వ్యవసాయం లాభసాటిగా ఉండడం లేదని అన్నారు. సరైన విద్య, వైద్యం అందక, ఉపాధి లేక ప్రజలు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సెంటు భూములేని నిరుపేదలు అనేక మంది ఉన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర ఆధ్వర్యాన గ్రామ కమిటీ ఏర్పాటైంది. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు తెలుసుకుని గ్రామ కమిటీలు వేసి పోరాటాలు నిర్వహిస్తామని, అందుకు ప్రజల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివ, కృష్ణ, అన్ని తరగతుల కూలీలు పాల్గొన్నారు.

ఇక సచివాలయం వద్దే గ్రీవెన్స్

ప్రజాశక్తి - పాచిపెంట

ఇకపై ప్రతి గురువారం మండలంలోని 17 సచివాలయాల పరిధిలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని స్థానిక ఎంపిడిఒ బివిజె పాత్రో తెలిపారు సమస్యలు లిఖితపూర్వకంగా ఇచ్చేవారు జిల్లా, మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేదన్నారు. సంబంధిత సచివాలయాల్లోనే అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం లిఖితపూర్వకంగా సమర్పించుకోవచ్చునని తెలిపారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి సచివాలయాల వద్ద గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నామని, అర్జీదారులు వీటిని వినియోగించుకోవాలని ఎంపిడిఒ కోరారు.

గుమ్మలక్ష్మీపురం : ఇకపై ప్రజలు తమ ఫిర్యాదులను చేసేందుకు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగొద్దని, స్థానిక గ్రామ సచివాలయాల్లోనే తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎల్.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలెక్టర్ ఆదేశాలు మేరకు గ్రామ సచివాలయ కార్యాలయంలో ప్రతి గురువారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. అలాకాకుండా ఎవరైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందజేసేందుకు వెళ్తే సంబంధిత కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కురుపాం : మండల పరిషత్ కార్యాలయం, సచివాలయాల్లో ప్రతి గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి బుధవారం తెలిపారు. ప్రజలు తమ అర్జీలను గ్రామ సచివాలయంలో ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మండల స్థాయి సమస్యలు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -కొమరాడ/ పార్వతీపురంటౌన్

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు కోరారు. పార్వతీపురం పట్టణంలోని జగన్నాధపురం పట్టణ ఆరోగ్య కేంద్రం, కొమరాడ విక్రంపురంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాలను బుధవారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద అందజేస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు పరిశీలించారు .ఎంత మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు,స్పెషలిస్ట్ వైద్య సేవలు పరిశీలించారు. అక్కడ గర్భిణీలు, వృద్ధులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమ వివరాలన్నీ ప్రోగ్రాం వారీగా వైద్య సిబ్బంది నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ విజయ్ మోహన్, ఎన్‌సిడి పిఒ డాక్టర్ టి. జగన్మోహనరావు, డిపిఎంఒ డాక్టర్ రఘు కుమార్, సంబంధిత వైద్యాధికారులు పాల్గొన్నారు.

309 మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కిమ్మి, పి.నందివాడ గ్రామాల్లో బుధవారం ఎస్ ఎన్ఎస్‌పిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు ఎం.సాయి కుమార్, ఎ.మానస 309 మందికి వైద్యపరీక్షలు చేశారు. జ్వర పీడితులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మధుమేహ, రక్తపోటు, కేన్సర్, సికిల్ సెల్ తదితర రకాలైన వ్యాధులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుశాంత్ జన అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవ అలవర్చుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ పిఒ, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యార్థులు నిస్వార్థం లేని సేవ చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ ఉండాలన్నారు. కార్యక్రమంలో బోధకులు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ నందివాడ కృష్ణబాబు కోరారు. జియమ్మవలస మండలం ఇటికలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ద్వారపురెడ్డి రామకృష్ణ, వారాడ శ్రీను నాయుడు, యాగిరెడ్డి శంకర రావు ఉన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి ఒక్కరూ తమ అవకాశం మేరకు సామాజిక సేవ చేయాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు కోరారు. తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా బాలల సత్వర చికిత్సా కేంద్రం, పోషకాహార పునరావాస కేంద్రాల్లో బుధవారం ఆయన సేవా కార్యక్రమం చేపట్టారు. ఎన్ఆర్‌సిలో స్టీల్ కంచాలు, స్పూన్స్, పిల్లల ఆట వస్తువులు అక్కడ నిర్వాహక వైద్య సిబ్బందికి అందజేసి పిల్లలకు పండ్లు అందజేశారు. డిఇఐసిలో కొన్ని నెలల పాటు మినరల్ వాటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి ఏటా పలు ప్రత్యేక సందర్భాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మనం అందించే ఏ చిన్న సాయమైనా ఎంతో కొంత ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని తద్వారా ఎంతో మానసిక సంతృప్తి కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం అక్కడ పిల్లల ఆరోగ్య వివరాలపై తెలుసుకున్నారు.

ఎన్ఆర్‌సిలో స్టీలు కంచాలు అందజేస్తున్న జగన్మోహన్

వరినాట్లు మధ్య ఏర్పాటు చేసిన శ్మశాన వాటికలో నిర్వహిస్తున్న అంత్యక్రియలు

ఆక్రమణలో శ్మశాన వాటిక

తీవ్ర అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని వనం పంచాయతీ ఈదురువలసలో శ్మశానవాటిక ఆక్రమణకు గురికావడంతో మృతదేహాలను తీసుకెళ్లి, దహణ సంస్కారాలు చేసేందుకు ఆ గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈదులవలసలో వంజరాపు తిరుపతి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దహనసంస్కారాల నిమిత్తం శ్మశానవాటికకు తీసుకువెళ్లగా అక్కడ పూర్తిగా వరి నాటు వేసి ఆక్రమణకు గురి చేయడంతో దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్మశానం వాటిక లేక గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తరతరాలుగా ఉన్న శ్మశానం వాటికను కొంతమంది ఆక్రమిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై గతంలో మండల రెవెన్యూ అధికారులకు ఆ గ్రామ పెద్దలు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారులు శ్మశానం వాటిక గ్రామస్తులకు అప్పగించారు. అయితే మళ్లీ యథావిధిగా ఆ శ్మశానాన్ని ఆక్రమణదారులు స్వాధీనం చేసుకుని వరి నాటు వేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆక్రమణదారులను ఆ స్థలం వద్దకు రాకుండా శ్మశాన వాటికను అధికారికంగా అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారులు శ్మశానవాటిక అప్పగించకపోతే ఇకపై మృతదేహాలతో రహదారిపై నిరసన చేపడతామని గ్రామ పెద్దలు హెచ్చరించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రమైన సీతానగరం ప్రధాన రహదారిలో ఉన్న ఏడిద శ్రీదేవి ఇంట్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు పెద్దఎత్తున దాతలు ముందుకొస్తున్నారు. పెదబోగిలి మాజీ సర్పంచులు బుడితి శ్రీనివాసరావు, లంక లక్ష్మి, వార్డుసభ్యులు చెరో రూ.2వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

ప్రజాశక్తి - పాలకొండ

సిఎంకు వినతిని అందజేస్తున్న జయకృష్ణ

నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం వినతిని అందజేశారు. పాలకొండ పట్టణంలో ప్రధాన రహదారి (కళింగపట్నం -పార్వతీపురం) విస్తరణకు రూ.రూ.16.50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. జిఒ 3ను పురుద్ధరిస్తూ, గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. గిరిజన రైతులకు వ్యవసాయ యాంత్రీక పరికరాలు మంజూరు చేసేందుకు ఐటిడిఎ పిఒకు అనుమతి మంజూరు చేయాల్సిందిగా కోరారు. అలాగే జంపరకోట జలాశయం నిర్మాణం అసంపూర్తిగా ఉందని, రూ.30కోట్లు మంజూరు చేసి ఈ జలాశయాన్ని పూర్తి చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పాలకొండ నగర పంచాయతీకి డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉన్నదని, స్థల సమస్య తీర్చి, డంపింగ్ యార్డు మంజూరుకు తగు ఉత్తర్వులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. ఇందుకు సిఎం స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని, అవసరమైన నిధులు మంజూరు చేస్తానని తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వారికి ఉచిత ప్రయాణం ఏదీ?

ప్రజాశక్తి - మక్కువ

మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం ఈ ప్రాంత మహిళలు ఎరుగరని చెప్పడంలో అతిశయోక్తి కాదు. మక్కువ వయా బాగువలస మీదుగా సాలూరు వెళ్లే మహిళలు ఇప్పటికీ ఆటోల్లో ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. గత మూడు నెలలుగా ఈ రహదారి గుండా ఆర్‌టిసి బస్సులను నిలిపివేయడంతో స్త్రీశక్తి పథకానికి ఈ ప్రాంత మహిళలు నోచుకోవడంలేదు. స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత మండలానికి సుమారు 19 కిలోమీటర్ల రహదారి గుండా నిత్యం ఆర్టీసీ ప్రయాణం గతంలో కొనసాగేది. ప్రస్తుతం ఆ రహదారి అధ్వానంగా మారడంతో ఆర్టీసీ సర్వీసులను నిలిపివేసింది. సాలూరు నుంచి వయా మామిడిపల్లి - శంబర మీదుగా మక్కువ, దుగ్గేరుకు బస్సులను నడుపుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అధిక భారం, రవాణా ఛార్జీలు పడుతున్నప్పటికీ ప్రయాణం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొందని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టినట్లయితే ఆర్టీసీ బస్సులు తిరిగాడే పరిస్థితి ఉండేది. ఈ రూటులో గల సుమారు 15 గ్రామాల మహిళలకు ప్రభుత్వం చేపట్టిన స్త్రీశక్తి పథకం ఉపయోగించుకునే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ రహదారిని బాగు చేసి రాష్ట్రంలో మహిళలందరి మాదిరిగానే తమకు కూడా స్త్రీశక్తి పథకం అందేలా చూడాలని ఈ ప్రాంత మహిళలు కోరుతున్నారు.

సాలూరు-మక్కువ రోడ్డులో గతంలో ప్రయాణించిన బస్సు (ఫైల్)

విజేతలను అభినందిస్తున్న శశిభూషణరావు, ప్రిన్సిపల్

సత్య కళాశాల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల మధురవాడ చంద్రంపాలెంలో జరిగిన 5వ ఎన్ఎస్‌కెఎఐ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించారు. ఈ పోటీలను వాల్తేరు మార్షల్ ఆర్ట్స్ డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ షోటోకన్ కరాటే అసోసియేషన్ నిర్వహించింది. కాటా, కుంటిలో బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సత్య కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడారు. కరాటేలో ఇంకా రాణించాలని కోరారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, కోచ్ కె.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

భూదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -పాలకొండ

పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవిపై సోషల్ మీడియా వేదికగా అసభ్య వ్యాఖ్యలు చేసిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన మొద్దం గిరిబాబును బుధవారం డిఎస్పి రాంబాబు అదుపులోకి తీసుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన మొద్దం గిరిబాబు అనే వ్యక్తికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో స్నేహితులు ఉన్నారు. వారి ద్వారా రాజకీయాలపై అవగాహనతో జిల్లాకు చెందిన రాజకీయ నాయకుల ఇన్‌స్టాగ్రామ్ పేజీలు ఫాలో అయ్యేవాడు. పాలకొండ టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవి పార్టీ మీటింగుల్లో నారా చంద్రబాబునాయుడుతో దిగిన ఫొటోస్ అప్లోడ్ చేస్తుండడం చూసిన గిరిబాబు ఆ ఫోటోలపై అసభ్యకరంగా కామెంట్ చేశాడు. దీనిపై పడాల భూదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నారు. డిఎస్పి రాంబాబు, సిఐ ముద్దాయి మొబైల్ లొకేషన్ ద్వారా అతనికి శ్రీకాకుళం జిల్లాతో అనుబంధం ఉండటంతో పాలకొండ కోట దుర్గమ్మ వారి దర్శనం కోసం వాళ్ళ ఊరు నుంచి పాలకొండకు వచ్చారు. దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణం కోసం ఆర్టీసీ కాంప్లెక్స్ రాగా, అతడ్ని పట్టుకుని మధ్యవర్తుల సమక్షంలో బుధవారం సాయంత్రం గంటలకు అరెస్టు చేశారు.

పనుకుపేటలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుకుపేటలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నానో ఎరువు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో వలసబల్లేరు లో వ్యవసాయ శాఖ అధికారి పి.నాగేశ్వరరావు బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పురుగు పట్టిన పొలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి నీమాస్త్రం పిచికారీ తప్పనిసరిగా చేస్తే పురుగు పంటల నుండి నిష్క్రమిస్తుందని అన్నారు. అలాగే గట్లపై కంది, తీగ జాతి పండ్లు మొక్కలు, కాయగూరలు పంటలు వేసి ఖర్చులు తగ్గించుకునేలా సిద్ధమవ్వాలని, రబీకి ప్రణాళిక సిద్ధం చేసుకుని, 365 రోజులు పంటలు ఉండేలా ఎటిఎం నమూనాలు వేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పి-4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్థిక స్వావలంబన చేకూర్చే విధంగా ప్రభుత్వం పి4 విధానాన్ని అమలు చేస్తుందనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. బుధవారం తమ కార్యాలయంలో పి4ను మరింత సమర్ధవంతంగా అమలు చేసే విధానంపై వెల్ఫేర్, శానిటేషన్, ఉమెన్ ప్రొటెక్షన్, హెల్త్, ఎడ్యుకేషన్ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పి4 అమలుపై విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన సర్వేలో కార్పొరేషన్ పరిధిలో 3,760 బంగారు కుటుంబాలుగా గుర్తించామని, వివిధ రూపాలలో సహాయాన్ని అందించేందుకు 299 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారని తెలిపారు. ఇప్పటివరకు 1,363 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారని, ఇంకా 2,397 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందని తెలిపారు. ఆర్థిక ,ఆర్థికేతర అవసరాలను సమకూర్చి ఆదర్శంగా నిలవాలన్నారు. శిక్షణ శిబిరంలో టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచి హిందీ భాషా బోధన ఉండాలి

విజయనగరం టౌన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండి హిందీ భాషా బోధనను ప్రవేశపెట్టాలని హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్, జిల్లా అధ్యక్షురాలు పి. ఉమాబాల, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హిందీ పక్షోత్సవం సందర్భంగా హిందీ మంచ్ విజనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం సరస్వతి శిశు మందిర్‌లో జరిగిన హిందీ పక్షోత్సవ సభలో వక్తలు మాట్లాడారు. జాతీయ భాషను ప్రాథమిక స్థాయి నుండి బోధించడం ఉచితమని అన్నారు. హిందీ లెక్చరర్ దేవరకొండ రామచంద్ర రావు, బిజెపి నాయకులు కుసుమంచి సుబ్బారావు, సరస్వతి శిశు మందిర్ కార్యదర్శి ధవళ సర్వేశ్వరరావు, హిందీ మంచ్ శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు కనుగుల సత్యం, రొంపివలస రామారావు, మంచ్ జిల్లా సహాయ కార్యదర్శి నందిగాం చిన్నాదేవి, తదితరులు మాట్లాడారు.